

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రుసుమును సైబర్‌ట్రెజరీ నెట్‌బ్యాంకింగ్ ద్వారా మాత్ర మే చెల్లించాలని ఆయన తెలిపారు. అపరాధ రుసుము (తత్కాల్) 100 రూపాయలతో ఈనెల 23 వరకు చెల్లించవచ్చన్నారు. చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు బీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీఈవో సూచించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, పాల్గొన్న కలెక్టర్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలతో ముందుకు వెళ్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్లు నెలకొల్పి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య పరస్పర ఒప్పందం ఖరారైందని ఆయన తెలిపారు. ఈనేపథ్యంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియపై ప్రగతిని సమీక్షించారు. ఐదు సంవత్సరాల వ్యవధిలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని ఈ దిశగా మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఈ ఆర్థిక చేయూతను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుంటూ సమర్థవంతమైన వ్యాపార లావాదేవీలతో ఆర్థిక పరిపుష్టి సాధించేలా అధికారులు తోడ్పాటును అందించాలన్నారు. మహిళా సంఘాలు సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటు కోసం వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని, ప్రభుత్వ భూములను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం ఇప్పించేలా చొరవ చూపాలని మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్‌కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని త్వరలోనే వాటిని ఖరారు చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా సంఘాలను గుర్తించి భూసేకరణ, బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా ఒక మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తికి 4 ఎకరాల స్థలం అవసరం అవుతుందని ఈ లెక్కన ప్రతీ జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4వేల ఎకరాల స్థలాన్ని సేకరించాల్సి ఉంటుందన్నారు. దేవాదాయ, నీటి పారుదల శాఖ పరిధిలోని భూములను గుర్తించాలని ఆర్‌వో ఎఫ్ఆర్ కింద గిరిజనులకు అందించిన భూములను సైతం అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు లభించిందని, గిరిజనులకు అందించిన భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదన్నారు.

మిగతా 8వ పేజీలో...



నామినేటెడ్‌కు పెరిగిన పోటీ!

- పదవుల కోసం కాంగ్రెస్‌లో నేతల మధ్య పెరిగిన పోటీ
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి తీవ్ర ప్రయత్నాలు
- అధికార పార్టీ కావడంతో కలిసివస్తుందని భావిస్తున్న నేతలు
- వలస నేతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పార్టీ ఎమ్మెల్యేలు, చైర్మన్లు

నిజామాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో పదవుల కోసం నేతల మధ్య పోటీ పెరిగింది. ఎమ్మెల్యేల నుంచి మంత్రులను కలుస్తూ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో పోటీకి సిద్ధమవుతూనే నామినేటెడ్ పోస్టుల కోసం తీవ్రప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలిస్తే సరే.. లేకుంటే తమకు నామినేటెడ్ పదవులను ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది నేతలు ఎమ్మెల్యేలతో వెంట ఉంటూనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికలు వచ్చేలోపు ఆయా గ్రామాలు, మండలాల పరిధిలో పనులు పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. తాము చేసిన పనుల ఆధారంగా ఓట్లు అడిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీకి పాత తరం నేతలతో పాటు యూత్ కూడా ఎక్కువ మొత్తంలో సిద్ధమవుతుండటంతో సీనియర్ నేతలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి చేరిన వారు కూడా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో అన్ని నియోజకవర్గాల పరిధిలో పోటీ వాతావరణం నెలకొంది. పార్టీలోనే అంతర్గత పోరు కొనసాగుతుండటంతో ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలు సర్దిచెబుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత అవకాశాలను కల్పిస్తామని హామీ ఇస్తున్నారు.

పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు

జిల్లాలోనే కాంగ్రెస్‌లో పదవుల కోసం పోటీ పెరిగింది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పదవులు ఆశిస్తున్న నేతలు పెరిగారు. పార్టీని అంటిపెట్టుకొని ఏళ్ల తరబడి ఉన్న వారితో పాటు ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారి మధ్య పోరు పెరుగుతోంది. గ్రామ స్థాయి నుంచి మం డల, జిల్లా స్థాయి వరకు ఇదే పరిస్థితి కనిపి స్తోంది. కొన్ని నియోజకవర్గాల పరిధిలో ఎమ్మె ల్యేలు లేనిచోట గ్రూపులు కూడా పెరిగాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవులను దృష్టిలో పెట్టుకొని ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది ఎమ్మెల్యేల ద్వారా నిధులను విడుదల చేయిం చుకొని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పనులు చేస్తున్నారు. మరికొంత మంది తాము పోటీ చేయాలనుకున్న ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టే విధంగా చూస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా నుంచి ఎక్కువ మంది పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ అధికారంలో ఉండటంతో కలిసివస్తుందని నేతలందరూ భావిస్తున్నారు. సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి పార్టీలో ఉన్న సీనియర్ నేతలు ఈ ఎన్నికలపై దృష్టిపెట్టి పనిచేస్తు న్నారు. పదేళ్లలో పోటీ చేసిన అవకాశంరాని వారందరూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అనుకూలిస్తే పోటీకి సిద్ధమవుతున్నారు. ఒకవేళ తమకురాకున్నా తమ కుటుంబంలోని మహిళలను కూడా పోటీకి దించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరికి సొంత పార్టీలోని యూత్ నుంచి ఎక్కువగా పోటీ ఉంది. యూత్ కూడా స్థానిక సంస్థల్లో పోటీకి సన్నద్ధమవుతున్నారు.

పదవులపై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల దృష్టి

ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పని చేసిన వారు ఈ పదవులపై దృష్టిపెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు ఇతర పార్టీల నుంచి ఎన్నికల సమయంలో చేరినవారు సైతం

మిగతా 8వ పేజీలో...

'ప్రజాపాలన' తెచ్చిన ఘనత ఉద్యోగులదే..

- ఉద్యోగులు ప్రభుత్వంలో కుటుంబ సభ్యులే
- ఏడాదిలో 60వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది
- టీఎన్‌జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

8



అటకెక్కిన పల్లె దవాఖాన

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- రోగులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

7



ఫటా..ఫట్...



నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

: ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి

ఖిల్లా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించడమే పోలీసుల లక్ష్యమని, నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి అన్నారు. నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలపై 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఇటీవల పెరిగిన సైబర్ నేరాలను ఎలా నియంత్రిస్తున్నారు?

ఎస్‌హెచ్‌వో: ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించరాదు. అనుమానం ఉంటే 1930నంబర్‌కు కాల్ చేయాలి.

ఆంధ్రజ్యోతి: దొంగతనాలను ఎలా అరికడుతున్నారు ?

ఎస్‌హెచ్‌వో: ప్రజలు తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదు. పోలీసు స్టేషన్‌లో సమాచారమివ్వాలి.

ఆంధ్రజ్యోతి : రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు ?

ఎస్‌హెచ్‌వో: పెట్రోలింగ్ చేయడానికి అనుకూలంగా ద్విచక్రవాహనాలతో బ్లూకోట్‌ను కాలనీల్లో సిబ్బందికి విధులు వేస్తాం. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచుతాం. రాత్రి వేళ అనుమానాస్పదంగా తిరిగే వారిని గుర్తించి వారి వివరాలు సేకరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : డయల్ 100కు కాల్ చేస్తే ఎన్ని నిమిషాల్లో స్పందిస్తారు.?

ఎస్‌హెచ్‌వో: ఆపత్కాలంలో డయల్ 100 కాల్ ఎంతో ఉపయోగపడుతుంది. బాధితులు డయల్ 100కు కాల్ చేయగానే వెంటనే స్పందించి 5నుంచి 10నిమిషాల్లో ఘటనా స్థలానికి సిబ్బందిని తరలిస్తాం. కానీ డయల్ 100కాల్‌ను ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయరాదు. దీనివల్ల అసలైన బాధితులకు అత్యవసర సేవలు అందకుండా పోయే ప్రమాదం ఉంటుంది.



• నికాల్‌పూర్‌లో సీడ్ మక్కా నుంచి సుంచును తొలగిస్తున్న కూలీలు

మక్క సాగుతో నష్టం ఉండదు..

: ఐల సదానందం, రైతు, నికాల్‌పూర్



ప్రతీ సంవత్సరం ఎకరం వరకు మక్క సాగు చేసాను. ఈ సంవత్సరం మక్కలకు రేటు ఎక్కువగా ఉండడంతో ఒక ఎకరం సాగు పెంచాను. గత ఏడాది దిగుబడి అధికంగానే వచ్చింది. మక్క సాగు చేయడం వల్ల నష్టమేమి ఉండదు. మక్క సాగుకు శ్రమ, ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు మక్క సాగుకే మొగ్గుచూపుతున్నారు.

మక్క సాగుకే మొగ్గు

- తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం
- ప్రభుత్వ మద్దతు ధరకంటే అధికంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

డొంకేశ్వర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో మొక్కజొన్న సాగుకు అధిక సంఖ్యలో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇతర పంటలను సాగుచేస్తే పెట్టుబడులు పెరగడం.. ఆశించిన దిగుబడులు రాకపోవడంతో మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు కూడా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తున్నారు. మండలంలో గతఏడాది యాసంగిలో 897 ఎకరాల్లో వానాకాలంలో 1088 ఎకరాల్లో పంటను సాగు చేయగా, ఈ యాసంగిలో 1450కి పైగా ఎకరాల్లో పంటను సాగు చేపట్టారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొక్కజొన్న పంట సాగుకు పెట్టుబడి తక్కువ, విత్తనం నాటినప్పటి నుంచి పంటను చేతికి వచ్చే వరకు యంత్రాలతోనే పనులు చేయిస్తుండడంతో కూలీల అవసరం నామ మాత్రమే. పంటకు నీటితడులు తగ్గినా ఇబ్బంది ఉండదు. దీంతో రైతులు గతం కంటే ఎక్కువగా మక్క సాగు చేస్తున్నారు.

మద్దతు ధర కంటే ఎక్కువ వస్తుండడంతో..

వర్షాలతో భూ గర్భజలాలు పెరగడంతో ఈ యాసంగిలో మక్కసాగు చేసేందుకు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. మరోవైపు ప్రభుత్వం కూడా క్వింటాలు మక్కలకు రూ.2200 మద్దతు ధర అందిస్తోంది. ఒక్కసారి ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా చెల్లించి పంటను కొనుగోలు చేస్తుండడంతో మక్కవైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా కోళ్లకు, పశువులకు దాణాగా మక్కలను ఉపయోగిస్తుండడంతో మక్కలకు అధిక డిమాండ్ పెరుగుతోంది.

ఫిబ్రవరిలో చేతికిరానున్న పంట..

మొక్కజొన్న పంట ఫిబ్రవరిలోని చేతికి రానుంది. పంట ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఖర్చులు పోగా ఎకరాకు రూ.45వేలకు పైగా మిగులుతుంది. సీడ్ మక్క సాగు చేసిన రైతులు ముందస్తు ఒప్పందంతో సాగు చేస్తున్నారు. లోకల్ మక్కల కంటే రేటు ఎక్కువగా వస్తుందని వ్యాపారులు, మక్క బుట్టతో సహా కొనుగోలు చేయడంతో సీడ్ మక్క సాగు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. భైసారం, లోకల్ మక్కను బుట్ట నుంచి మక్కలను వేరు చేసి వాటిని తేమ శాతం తగ్గించి వ్యాపారులకు విక్రయించాల్సి ఉంటుంది. దీంతో రైతులు శ్రమ ఎక్కువగా ఉండడంతో సీడ్ మక్కా సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపారు. సీడ్ మక్క సాగు చేసిన రైతులకు సుమారు రూ.లక్ష వరకు మిగులుతుందని రైతులు పేర్కొంటున్నారు.



బడాపహాడ్ టెండర్ రూ. 4.32కోట్లు

- 11 నుంచి ఉర్సు ఉత్సవాలు
- దోపిడే ధ్యేయంగా కాంట్రాక్టర్లు

వర్ని, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం బడాపహాడ్ (పెద్దగుట్ట) టెండర్ 2025-26 సంవత్సరానికి రికార్డు టెండర్ పలికింది. కొన్ని నెలలుగా బడాపహాడ్ నిర్వహణ బాధ్యతలను ఇష్టారాజ్యంగా చేపట్టిన వక్ఫ్‌బోర్డు సిబ్బంది బాధ్యతలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం లెక్కించిన హుండీ లెక్కలు వక్ఫ్‌బోర్డు సిబ్బంది చేతివాటంతో పొంతన లేకుండా పోయాయి. దీంతో అంజాద్ అనే వ్యక్తి రూ.4.32కోట్లకు టెండర్ వేసి బడాపహాడ్ నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్నారు. అయితే సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా భక్తులను నిలువుదోపిడికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. మేక వధకు రూ.600, పూజ నిర్వహణకు రూ.3వేలు దౌర్జన్యంగా దండుకునేందుకు సిండికేట్‌గా ఏర్పడ్డారు. ఫలితంగా కందూరుల నిమిత్తం వచ్చే తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన భక్తులు మొక్కుల సమర్పణకు కాంట్రాక్టర్లు అడిగిన డబ్బులకు తలొగ్గి సమర్పించే దుస్థితి ఏర్పడింది. గతంలో దోపిడీ నియంత్రణకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటి కలెక్టర్, రెవెన్యూ డివిజనల్, సబ్ కలెక్టర్, పర్యవేక్షణలో దోపిడీ నియంత్రణకు చర్యలు చేపట్టారు. దీంతో రాష్ట వక్ఫ్‌బోర్డు సిబ్బంది, నాయకులు అసెంబ్లీ సాక్షిగా అప్పటి సీఎం కేసీఆర్ నోరునొక్కేసి మళ్లీ టెండర్ విధానంను తెరపైకి తెచ్చారు. దీంతో పాత పద్ధతిలో దోపిడీ వ్యవస్థ రాజ్యమేలే దుస్థితి నెలకొంది. ఈ నెల 11నుంచి బడాపహాడ్ ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు మౌలిక వసతుల కల్పనలో వక్ఫ్‌బోర్డు సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉర్సు నిర్వహణకు వక్ఫ్‌బోర్డు కేటాయించే నిధులు స్వాహాకు కుట్ర చేస్తున్నారని తెలుస్తోంది.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

• ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలి • అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విద్యాశాఖ అధికారులకు సూచించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో డీఈవో అశోక్, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్‌లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉందని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోవడం వల్లే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని, అదే విధంగా మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందడం లేదన్నారు. వచ్చే ఏడాది ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నగరంలో మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా వచ్చిన నిధులు, పనుల వివరాలు, మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీఈవో అశోక్‌తో పాటు నార్త్, సౌత్ ఎంఈవోలు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

నేడు జిల్లాకు రానున్న రైతు కమిషన్ చైర్మన్, సభ్యులు

- బుస్సాపూర్‌లో పసుపు పంట, కమ్మర్‌పల్లిలో పసుపు పరిశోధన కేంద్రాన్ని పరిశీలించనున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు గురువారం జిల్లాకు రానున్నారు. హైదరాబాద్ నుంచి బుధవారమే బయలుదేరి రాత్రికి పోచంపాడ్ అతిథి గృహానికి చేరుకోనున్నారు. గురువారం ఉదయం పోచంపాడ్ అతిథి గృహం నుంచి బయలుదేరి బుస్సాపూర్‌లోని పసుపు పంటను పరిశీలించనున్నారు. అంక్సాపూర్‌లో టిఫిన్ చేసిన అనంతరం అక్కడ పసుపు పంటను పరిశీలించి రైతులనుంచి వివరాలు తెలుసుకోనున్నారు. మోర్తాడ్‌లో పసుపు బాయిలింగ్ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి కమ్మర్‌పల్లికి చేరుకొని పసుపు పరిశోధన కేంద్రాన్ని పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకొని 2గంటలకు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఫటా..ఫట్...

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● బీబీపేట ఎస్సై ప్రభాకర్



బీబీపేట మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారి పైచట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మీ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

ఎస్సై:బీబీపేట పోలీసు స్టేషన్ పరిధిలో 11 గ్రామాలున్నాయి

ఆంధ్రజ్యోతి:మండలంలోని యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎస్సై:మండలంలోని యువతీ, యువకులకు, కస్తూర్బాగాంధీ పాఠశాలలు, ప్రభుత్వ బాలికలు, బాలుర పాఠశాలల్లో వివిధ అంశాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై: మండల పరిధిలో ఉన్న ప్రతీ గ్రామంలోని ప్రజలకు సీసీ కెమెరాల పనితీరు పట్ల అవగాహన సమావేశాలను పెట్టి తెలియజేశాం. పలువురి సహకారంతో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి: డ్రంకెన్ డ్రైవ్ నివారణకు అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై: మద్యం తాగి వాహనాలు నడపరాదని యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఓవర్ స్పీడ్ వెళ్లరాదని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఆక్రమ ఇసుక దందా కొనసాగుతుందా?

ఎస్సై:మండలంలో ఎలాంటి ఆక్రమ ఇసుక దందా నడవడం లేదు. మండలం మీదుగా ఇతర గ్రామాలు, మండలాల నుంచి కుడా ఆక్రమంగా ఇసుక తరలించడం లేదు.

ఆంధ్రజ్యోతి:మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

ఎస్సై:మండలంలోని జనగామ,శేరిబీబీపేట, మాందాపూర్, రాంరెడ్డిపల్లి,యాడారం,సీతారాంపల్లి, తుజాల్‌పూర్, మాల్యాపూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి,బీబీపేట గ్రామాల్లో ప్రతీగ్రామానికి పోలీసు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.శాంతి భద్రతలపై ప్రతీగ్రామంలో సిబ్బందితో ప్రతిరోజు ప్రత్యేక నిఘాపెడుతున్నాం.

● (ఆంధ్రజ్యోతి,బీబీపేట్)

సాగునీటి కాలువల స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

● ఇరిగేషన్ డీఈ భూమన్న



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ భూమన్న

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల స్థలాలను అక్రమంగా కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ భూమన్న హెచ్చరించారు. కోటగిరి మండల కేంద్రంలో నిజాంసాగర్ డీ28/1/2 కెనాల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పాత బస్టాండ్ సమీపంలో రఫీక్ అనే వ్యక్తి సాగునీటి కాలువ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించడంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కబ్జాకు గురైన స్థలాన్ని డీఈ పరిశీలించారు. కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారం రోజుల గడువులోగా అక్రమ నిర్మాణాలు తొలగించాలన్నారు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలు తొలగిస్తామన్నారు. ఆయన వెంట కోటగిరి తహసీల్దార్ గంగాధర్, ఇరిగేషన్ ఏఈ సతీష్ తదితరులున్నారు.

కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి8(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపర్చుకుంటూ అడ్మిషన్‌ల సంఖ్యను పెంచాలని ఇంటర్ అకాడమిక్ స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న అన్నారు. ఆర్మూర్ పట్టణంలో బుధవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 90రోజుల యాక్షన్ ప్రణాళికలో భాగంగా అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని ఉత్తీర్ణులు అయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. నిజామాబాద్ డీఐఈవో రవికుమార్ మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్‌ల సంఖ్య పెంచడంతో పాటు సైన్స్‌విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులను ఎక్కువగా చేయించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి,అధ్యాపకులు పాల్గొన్నారు.

నందిపేటలో పీఏసీఎస్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నందిపేట వీడీసీసభ్యులు

నందిపేట, జనవరి8(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలని బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, గ్రామాభివృద్ధి కమిటీ సదర్‌లు ఎర్రం మురళీ, మచ్చర్ల చిన్న సాయిలు,నారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్ సంఘాన్ని నాలుగు సంఘాలుగా విభజించాలి

మాక్లూర్: మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని నాలుగు సంఘాలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాలకవర్గం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాక్లూర్, కల్లెడి, గొట్టుముక్కల, చిక్లి నాలుగు సంఘాలుగా విభజించాలని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బూరోల్ల అశోక్, గుండారం శేఖర్, సంఘ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కోటగిరి గ్రామానికి చెందిన మామిడి లక్ష్మణ్(53) అనే వ్యక్తి ఎత్తొండ రోడ్డులో తన పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎత్తొండ గ్రామం నుంచి గుండ్ల లక్ష్మణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కోటగిరి వైపు వస్తున్నారు. ఓ పాఠశాల బస్సును తప్పించే క్రమంలో ఎదురెదురుగా వీరి వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో కోటగిరి గ్రామానికి చెందిన లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మోర్తాడ్‌లో కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

వేల్పూర్, జనవరి8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్ సూచించారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు అనేది సైబర్ క్రైం టెక్నిక్, ఇక్కడ మోసగాళ్లు ఎస్ఎంఎస్ పంపడం, వ్యక్తులకు వీడియో కాల్ చేయడం, ప్రభుత్వ దర్యాప్తు సంస్థల నుంచి చట్టాన్ని అమలు చేసే అధికారులుగా నటిస్తూ మిమ్మల్ని బురిడికొట్టించి మీ వద్ద నుంచి డబ్బులు దండుకుంటారని పేర్కొన్నారు. కాబట్టి డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి తమ వ్యక్తిగత ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ మొబైల్ ఓటీపీ, తదితర వివరాలను గోప్యంగా ఉంచాలని సూచించారు. మీపేరుపై డ్రగ్స్, తప్పుడు పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా, మనీలాండరింగ్, నిషేధిత వస్తువులు వచ్చినట్టుగా చెబుతారన్నారు. ఒకవేళ అసలు నేను ఎలాంటి ఆర్డర్ పెట్టాలని వారితో అరిచిచెప్పిన వినరు లేదు మీ పేరు మీద వచ్చిం దని కాబట్టి బాధ్యులు అవుతారని చట్టపరంగా చిక్కుల్లో పడతారని, మీకు వారు చెబుతూ నమ్మేలా చేస్తారు. కేసు డీల్ చేసి సెటిల్‌మెంట్ చేసేందుకు డబ్బులు అడుగుతారు, నమ్మితే మీడబ్బులు పోతాయి ఇదే డిజిటల్ అరెస్టు అంటారు. డిజిటల్ అరెస్టు కేసుల్లో అధికారుల రూపంలో ఆడియో, వీడియో కాల్స్ చేస్తారు వాట్సాప్ స్కైప్ వంటి ప్లాంట్ ఫాంల ద్వారా వీడియోకాల్ చేస్తారు. బాధితులకు డిజిటల్ అరెస్టు వారంటిలను జారీ చేస్తారు. ఇతరరాత్ర చట్ట ఉల్లంఘాలను వివిధ కారణాలను చూపిస్తూ బాధితులను భయపెడతా రన్నారు. కాబట్టి నిజమైన అధికారులు ఎప్పుడు చెల్లించాలని, బ్యాంకింగ్ వివరాలు కావా లని అడగరనే విషయాన్ని ప్రజలు గమనించుకోవాలని తెలిపారు. మోసానికి గురైతే వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930నెంబర్‌లో సంప్రదించాలని, పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైంపోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్సై సంజీవ్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: విద్యార్థులు శ్రద్ధాసక్తులతో చదువుకుని ప్రయోజకులవ్వాలని దురాలవాట్లకు దూరంగా ఉండాలని ప్రస్తుత పరిస్థితిల్లో అధికమవుతున్న సైబర్ నేరాల పట్ల అప్రతమత్తంగా ఉండాలని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. సైబర్ సురక్షిత, జాతీయభద్రత అనే అవశాలపై కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు, తీసుకోవాలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో సమాజంలో జరుగుతున్న పలు సైబర్ నేరాలగురించి విద్యార్థులకు తెలియపరుస్తూ భవిష్యత్తులో జరుగబోవు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. వాటిబారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైతం సైబర్ నేరాల పట్లఅవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయపాల్‌రెడ్డి, హైస్కూల్ హెచ్ ఎం సాయన్న, ఉపాధ్యాయులు, స్థానిక పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో బుధవారం సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు ఎస్సై విక్రం అవగా హన కల్పించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సైబర్ క్రైం గురించి యువకులు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్ ద్వారా మోసాలు చేస్తున్నారని వివరిం చారు. అంతేగాక ఆన్‌లైన్‌గేమ్స్ ఆడకూడదని, ఈ విధంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన వివరించారు. ఆయన వెంట పోలీస్‌సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుద్రూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్ర మత్తంగా ఉండా లని రుద్రూర్ ఎస్సై సాయన్న సూచించారు. బుధ వారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రజ లకు రుద్రూర్ ఎస్సై సాయన్న సైబర్ నేరాలపై అవగాహన కల్పిం చారు. ఇతర వ్యక్తులు మీ ఖాతా నంబర్, ఓటీపీలు అడిగితే చెప్ప వద్దని, పోలీసు లకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సద స్సులో పోలీసు సిబ్బంది ఉన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు



చైన్‌స్నాచర్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్

నవీపేట,జనవరి8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న మండలంలోని నందిగామలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందిగామకు చెందిన గంగామణి సోమవారం రాత్రి తన ఇంటి వెనుక వైపున ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి బైక్‌పై వచ్చాడని అనంతరం గంగామణి మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడుతో పాటు ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను సైతం లాక్కెళ్లాడని ఆయన పేర్కొన్నారు.ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న నవీపేట పోలీసులు, క్రైమ్ పార్టీ ఆధ్వర్యంలో నిందితుడిని బుధవారం నవీపేటలోని శివాజీచౌక్‌వద్దపట్టుకోవడం జరిగిందని సీఐ వివరించారు. నిందితుడు నిర్మల్ జిల్లా మూటపూర్‌కు చెందిన మాడరి గంగాదర్‌గా గుర్తించడం జరిగిందని ఆయన వివరించారు. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెల తాడుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంగాదర్ 2022సంవత్సరంలో నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఒకహత్యాయత్నం కేసులోసైతం నిందితుడిగా ఉన్నట్లు ఆయన వివరించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని 24గంటల్లో పట్టుకున్న ఎస్ఐ వినయ్‌తో పాటు పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

● మామిడిపల్లి చౌరస్తాలో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద లక్కరం రుకుంబాయి అనే మహిళా మెడలో నుంచి సుమారు మూడు తులాల బంగారు చైను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగ దొంగిలించాడు. మహిళ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని దొంగ మహిళ మెడలో నుంచి చైన్‌ను ఎత్తుకొని పారిపోయాడు. దీంతో రుకుంబాయి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



మేడిపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,జనవరి8(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

రుద్రూర్: పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీఓ సురేష్ బాబు సూచించారు. బుధవారం రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని తహసీల్దార్, ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

మోస్రా: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎంశ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండలంలోని మేడిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంట పాత్రలు ఎప్పుడు శుభ్రం చేసేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఎలాంటి తప్పిదం జరిగిన సహించేదిలేదన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ పెట్టిన అపార విద్యార్థుల కార్డు పనులు గడువు ఈ నెల చివరితో ముగుస్తుండగా కార్డులు ఆన్‌లైన్‌లో చేసేటప్పుడు తప్పులు లేకుండా ఉన్నవన్నీ పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా మండలంలో ప్రైవేటు పాఠశాలలో అపార కార్డు పనులను రోజువారీ పనులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

వేల్పూర్:మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఎంపీవో సాయిలు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి భరత్, స్వరూప్, కారోబార్ లింబాద్రి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అంగన్‌వాడి టీచర్‌లు, తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

భీమ్‌గల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): వాహనాలను మద్యం తాగి నడపరాదని ఎస్సై మహేష్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని ఎల్‌జె.ఫంక్షన్‌హాల్‌లో ఆటోయూనియన్, డ్రైవర్స్‌కు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని తెలిపారు. అనంతరం సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, మహిళ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాలో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

ముప్కాల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వినోద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో హెడ్‌కుక్, నైట్‌వాచ్‌మెన్ కొరకు పదోతరగతి, అసిస్టెంట్ కుక్‌కు ఏడో తరగతి పూర్తి చేసిన స్థానిక మండల మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ముప్కాల్ మండలానికి చెందిన మహిళలు ఈనెల 11తేదీలో ఆధార్‌కార్డు, ఫోటో, సర్టిఫికెలతో కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో అధిక మద్యం తాగి పట్టుబడ్డ వ్యక్తిని బుధవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయమూర్తి శేషతల్పసాయి పట్టుబడ్డ వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ప్రతీరోజు పట్టణంలోని ప్రధాన కూడళ్లలలో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కావున ప్రజలు అత్యధిక మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

దొంగ తనానికి యత్నం

ఆర్మూర్‌టౌన్, జనవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో లక్ష్మీ నర్సింహ వైన్‌షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి ఐదుగురు దొంగలు దొంగతనానికి యత్నించినట్టు తెలిసింది. గుర్తుతెలియని దొంగలు కారులో వచ్చి వైన్స్ షెట్టర్‌ను ధ్వంసం చేసి తీస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గమనించి వెంబడించగా దొంగలు పరారయ్యారని తెలిసింది.

సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ

ఎడపల్లి, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని వడ్డాపల్లి గ్రామంలో గల సంత్ సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ పూజారి శంకర్ పూజ నిమిత్తం ఆలయానికి వెళ్లగా ఆలయ గర్భగుడి తలుపులు తెరిచి ఉండడం చూసి గ్రామస్థులకు సమాచారం అందించాడు. వెంటనే గ్రామస్థులు ఆలయానికి చేరుకుని పరిశీలించగా అమ్మవారి మెడలోని 3 తులాల బంగారు గొలుసు, 15 గ్రాముల వెండి ఆభరణాలు, సంత్ సేవాలాల్ గుడిలోని తల్వార్‌లు కనిపించక పోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులు ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'బీజేపీ కార్యాలయంపై దాడి పిరికి పందల చర్య'



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి

సదాశివనగర్,జనవరి 8(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్రశాఖ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడిచేయడం పిరికిపందల చర్య అని బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు,కార్యకర్తలు తెగించి ఎదురుదాడులకు దిగేలా రెచ్చగొట్టెలా మాట్లాడరాదని హెచ్చరించారు. దేశం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అహర్నిశలు కృషిచేస్తుంటే రాష్ట్రాన్ని దోచుకోవడానికి కాంగ్రెస్ నాయకులు కంకణం కట్టుకున్నారని దీన్ని ప్రజ లందరూ గమనిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు కుంటరామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అమృతభూంరావు, మండల ఉపాధ్యక్షులు చక్రధర్‌గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు చందర్‌నాక్, కిసాన్‌మోర్చా నాయకులు సాయిలు, గ్రామఅధ్యక్షుడు ఏనుగు జైపాల్‌రెడ్డి, నల్ల సత్యం, బీజేపీ మండల నాయకులు,బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

తాడ్వాయి: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి తాటాకు చప్పుళ్లకు బీజేపీ భయపడదు. ఈ సమావేశంలో మండల బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దత్తాత్రేయ, బీజేపీ సీనియర్ నాయకులు రవి రమేష్‌నాయి, బూత్ అధ్యక్షుడు రాజు, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కళాశాల విద్యార్థులు

లింగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌లో రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్, లాంగ్‌జంప్, అత్‌లెటిక్స్ విభాగాల్లో ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. కళాశాలకు చెందిన సభావత్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న అఖిల 53కేజీల రెజ్లింగ్ విభాగంలో ద్వితీయ స్థానం లో నిలిచారు. సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న దారావత్ సాయిబాబ లాంగ్ జంప్‌లో రెండవ స్థానంలో నిలిచారు. బీపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న సబావత్ రాహుల్ అథెలెటిక్స్‌లో 100మీటర్లులో గెలుపొందా రు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అభినందిం చారు.

ఎమ్మెల్యేకు కలిసిన వెల్‌నెస్ ఆసుపత్రి బృందం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెల్‌నెస్ ఆసుపత్రి బృందం

బోధన్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని వెల్‌నెస్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో కలిసి వెల్‌నెస్ ఆసుపత్రి తరఫున నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఎం. రాజేష్ ఉన్నారు. త్వరలో నిజామాబాద్‌లో వెల్‌నెస్ ఆసుపత్రి రాబోతుందని తెలిపారు.

నేడు కమ్మర్‌పల్లికి కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డిల రాక

● రైతులతో ముఖాముఖి కార్యక్రమం



కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రం

కమ్మర్‌పల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి గురువారం(ఈ నెల 9న) తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డిలు వస్తున్నట్లు కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రంలో నిర్వహింపబడే రైతులతో ముఖాముఖి చర్చ, వ్యవసాయసమీక్షా సమావేశంలో వీరిద్దరూ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ పరిధి గ్రామాల రైతుల సంఘాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, సహకార సంఘాల డైరెక్టర్‌లు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



కమ్మర్‌పల్లిలో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

ఆర్మూర్‌రూరల్,జనవరి8(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్‌పట్టణంలోని మానవ విద్యావనరుల కేంద్రంలో బువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో రాజగంగారాం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు దయాసాగర్, జిల్లా బాధ్యులు గజేందర్, ఉపాధ్యక్షుడు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుకెంట బుచ్చన్న, మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, తపస్ మండల అధ్యక్షులు సల్లూరి కిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్, డివిజన్ కార్యదర్శి శంకర్ ఆనంద్ మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ యూపీఎస్ పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శివకుమార్, రవీందర్, సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



జాన్కంపేట్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్, జనవరి8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సౌడ రమేష్, మాజీఎంపీటీసీలు సౌడ చందన్, గాదేపల్లి సత్యనందం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మకంటి శోభన్‌గౌడ్, సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ కొలిప్యాక శ్రీనివాస్, డైరెక్టర్ తలారి శేఖర్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్‌లో బీజేపీ నాయకుడు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్, సాంబడికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ

● కొడవలితో ఒకరి గొంతు కోసిన యువకుడు ● పరిస్థితి విషమం



గొంతు తెగిఉన్న గంగమల్లు

నందిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితులే..కలిసి మందు తాగుదామని ప్రణాళిక వేసుకున్నారు.. కలిసి తాగారు..మద్యం మత్తులో మాటా, మాటా పెరిగింది..అందులో ఒకరితాగిన మైకంలో ఎదుటి వ్యక్తి గొంతును కొడవలితో కోసేశా డు. రక్తం మడుగుల్లో కొట్టుమిట్టాడాడు. చుట్టు ప్రక్కల వ్యక్తులు గమనించి అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన తుంగెన గణేష్, తోట గంగ మల్లు ఇద్దరు స్నేహితులు. బుధవారం ఇద్దరు కలిసి గణేష్ ఇంట్లో మద్యం సేవించారు. క్వాటర్, ఇంకో క్వాటర్ అనుకుంటూ ఫుల్‌గా తాగారు. తాగిన మైకంలో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగింది. దింతో గణేష్ వంట గదిలోని కొడవలి తీసుకొచ్చి ఏకంగా గంగమల్లు గొంతును కోశాడు. రక్తం మడుగుల్లో బాధితుడు కొట్టుమిట్టాడు. చుట్టు ప్రక్కల వ్యక్తులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుడు తోట గంగమల్లును హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.ఈ విషయమై స్థానిక పోలీసులకు వివరణ అడగగా సంఘటన జరిగిన విషయం వాస్తవ మేనని, రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎడపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై వంశీ కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠవాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అటకెక్కిన పల్లె దవాఖాన

● డాక్టర్లు రారు.. మందులు ఇవ్వరు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇందల్వాయి మండలంలోని పలు పల్లె దవాఖానాలు

ఇందల్వాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచనలతో గ్రామాల్లో పల్లె దవాఖానాల నిర్మాణాలు చేపట్టింది. పల్లె దవాఖానాలో ఒక డాక్టర్, ఒక నర్సు, ఆశావర్కర్లు పనిచేస్తుంటారు. దవఖానాకు వచ్చిన రోగులకు ఉచితంగా వైద్యం అందించి మందులను అందజేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అదేమీ ఆచరణలోకి రావడం లేదు. ఎప్పుడు డాక్టర్ వస్తారో, ఎప్పుడు దవాఖానా తెరుస్తారో తెలియక గ్రామీణ ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

డాక్టర్లు రాక ఇబ్బందులు

మండలంలోని నల్లవెల్లి, గౌరారం, సిర్నాపల్లి, లోలం గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయి. ప్రతీ దవాఖానాలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్, ఒక నర్సు, ఆశావర్కర్లు పనిచేస్తుంటారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దవాఖానాకు వచ్చే రోగులకు వైద్యం అందించి ఉచితంగా మందులను అందజేయాలి. డాక్టర్లు సరైన సమయంలో లేకపోవడంతో వివిధ కారణాలతో పల్లె దవాఖానాకు వచ్చిన రోగులు వెనుదిరుగుతున్నారు.

సమయపాలన కరువు

సోమవారం నుంచి మంగళవారం వరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి నిర్వహిస్తారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు విధులు నిర్వహిస్తున్న గ్రామాల్లో టీకాలు, దవాఖానాకు వచ్చిన రోగులను చూడాలి. ప్రతీ శనివారం పల్లె దవాఖానా పరిధిలోగల గ్రామాల్లోకి వెళ్లి టీకాలు వేయాలి. కానీ ఇవేమి పట్టించుకోకుండా ఒకేఒక్క రోజు బుధవారం మాత్రమే తాము విధులు నిర్వహిస్తున్న గ్రామాల్లోకి వెళ్లి నామమాత్రంగా విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. దవాఖానాకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. వివిధ ఇబ్బందులతో పల్లె దవాఖానాకు వస్తున్న రోగులకు తిప్పలు తప్పడం లేదు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటాం

● విశాలరాణి, పల్లె దవాఖానా జిల్లా ప్రాజెక్టు మేనేజర్

గ్రామీణ ప్రాంతాలలో డాక్టర్లు తప్పకుండా సమయపాలన పాటించాలి. సరైన సమయంలో ఆసుపత్రుల్లో లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం. పల్లె దవాఖానాకు వచ్చే రోగులను పరీక్షించి ఉచితంగానే మందులు అందజేయాలి.

ఎప్పుడు చూసినా తాళమే..

● జంగం గంగామణి, గ్రామస్థురాలు



వివిధ కారణాలతో జ్వరం వస్తే మాత్రల కోసం దవాఖానాకు వస్తే ఎవరూ ఉండరు. ఎప్పుడు చూసినా తాళమే ఉంటుంది. మందులు లేక మెడికల్‌లో తెచ్చుకుంటున్నా. అధికారులు స్పందించి ప్రతీ రోజు డాక్టర్లు వచ్చేలా చూడాలి.

దవాఖానాలో వైద్యులు ఉండు..

● ఆసది మురళి, గ్రామస్థుడు



నల్లవెల్లిలో పల్లె దవాఖానా ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. డాక్టర్లు సరిగారారు. ఎప్పుడు వస్తారో తెలియదు. ప్రతీరోజు డాక్టర్లు వచ్చి రోగులకు వైద్యం అందించాలి. డాక్టర్లు సరిగ్గా రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందేనా!?

● పట్టించుకోని విద్యాశాఖ

బాన్సువాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గాను పాఠశాలల్లో డిజిటల్, ఆన్‌లైన్ క్లాసులను ప్రవేశ పెట్టింది. లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేసి ఆయా పాఠశాలల్లో కొత్తగా డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. కానీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పాఠశాలల్లో కంప్యూటర్లు బోధించేందుకు గాను కంప్యూటర్ బోధకులు ఉండేవారు. కానీ నేడు ఉపాధ్యాయులే ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ క్లాసులు బోధించాల్సి వస్తుంది. ప్రస్తుతం పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గాను ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కానీ అది పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఉపయోగపడుతుందో లేదో చూడాల్సిందే. పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్నివిధాలా తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ అలసత్వం ప్రదర్శించడం పై మేధావులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ మండలంలో 46 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 13 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులే విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్ క్లాసులను నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రతీ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు నిష్ణాతులైన సిబ్బందిని నియమించినట్లయితే విద్యార్థులకు న్యాయం చేకూర్చినట్లవుతుందని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు.


బాన్సువాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న కంప్యూటర్లు


● ఉపాధ్యాయులే డిజిటల్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు..

ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులే విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా సమయాన్ని బట్టి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. - నాగేశ్వర్‌రావు, మండల విద్యాధికారి, బాన్సువాడ

శిథిలావస్థకు చేరిన టీటీడీసీ భవనాలు

● రూ.5 కోట్లతో నూతన భవనాలు నిర్మించేందుకు సన్నాహాలు ● పరిశీలించిన డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్


22ఏళ్ల క్రితం ప్రారంభించిన టీటీడీసీ శిలాఫలకం


పనికిరాకుండా మారిన భవనాలు

డిచ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు గత రెండు వారాల క్రితం డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ 22 ఏళ్ల క్రితం నిర్మించిన సాంకేతిక శిక్షణ భవనాలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భవనాల నాణ్యతను పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు 12, 2003 సంవత్సరంలో సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని అప్పటి మంత్రులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర రావులు ప్రారంభించారు. 20 సంవత్సరాల పాటు సేవలు అందించిన భవనాలు కొంతకాలంగా ఆలన పాలన కరువై శిథిలావస్థకు చేరాయి. దీంతో శిక్షణలు, సమావేశాలు శిథిలావస్థకు చేరిన భవనాల్లో పూర్తిగా నిలిపివేశారు. గత ఏడాది వర్షకాలంలో భవనాలు పూర్తిగా లీకేజీలతో తడిసి ముద్దయ్యాయి. భవనాల్లో షార్ట్ సర్క్యూట్‌తో గత ఏడాది అగ్ని ప్రమాదాలు జరగడంతో భవనం కూల్చివేశారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రానికి 13 కిలో మీటర్ల దూరంలో ఉన్న డిచ్‌పల్లిలోనే 5 కోట్లతో ఆధునాతన నూతన కార్యాలయ భవనం నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులు నమూనాలను తయారు చేసి అధికారులకు అందజేశారు. త్వరలోనే నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న పీడీ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠశాల ప్రాంగణంలో లయన్స్ బోధన్ సేవా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ అండ్ టాలెంట్ వీక్ నిర్వహించారు. డిసెంబర్ 19వ తేది నుంచి 25వ తేదీ వరకు ఆరు ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలు ఆలోచింపదగ్గవిగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవ అధ్యక్షుడు ఎం.బాలగంగాధర్‌రావు, సెక్రెటరీ పాపారావు, ట్రెజరర్ పాండురంగారావు, లయన్స్ ప్రతినిధులు ఆది నారాయణ, రవి కిరణ్, వీ. వెంకటేశం, సత్యనారాయణ, రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో


మద్నూర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

సోయా కొనుగోలు కేంద్రంలో అవకతవకలు

మద్నూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగాయని తహసీల్దార్ ముజీబ్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం పలువురు రైతులు బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మద్నూర్ మార్కెట్ యార్డులో నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ రైతులకు నష్టం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులు తీసుకొచ్చిన పంటకు కాటా చేయడానికి లారీ లోడు చేయడానికి ప్రభుత్వం రూ.30 చెల్లిస్తుందని. అధికాకుండా రైతుల నుంచి కొనుగోళ్ల కేంద్రం సిబ్బంది రూ. 40 హమాలీ పేరిట తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా సోయాబీన్ బస్తా 51 కిలోలు కాటా చేయాల్సి ఉండగా అదనంగా మూడు కిలోలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి హమాలీ చార్జీలు సోయాబీన్ అదనంగా తీసుకోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ వద్ద ఇప్పటివరకు తీసుకున్న హమాలీ చార్జీలను ధాన్యం డబ్బులను తిరిగి ఇప్పించాలంటూ కోరుతున్నారు.

డొంకేశ్వర్ రామాలయంలో వైభవంగా దీపోత్సవం


రామాలయంలో దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

డొంకేశ్వర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలలో డొంకేశ్వర్ మండల కేంద్రంలో రామాలయంలో వైభవంగా జరుగుతున్నాయి. డిసెంబరు 16నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు జనవరి 14వ తేదీ ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 24వ రోజు దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. రామాలయంలో కృష్ణుడి అకారం ఏర్పాటు చేసి 54 దీపాలు వెలిగించి మహిళలు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు తిరునగరి పాండురంగ ఆచార్య ఆధ్వర్యంలో సేవాకాల, శ్రీకృష్ణ గోదా అష్టోత్తర శతనామా పూజ, పల్లకీసేవ, దీపోత్సవం అరగింపు, పాసుర వితరణ, తీర్థప్రసాద గోష్టి పూజలు నిర్వహించారు. పూజలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మిర్ధాపల్లి విద్యార్థిని ఎంపిక


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఆర్మూర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్ధాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల పీడీ సుజాత తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి వరంగల్ జిల్లాలోని గీసుకొండలో జరగనున్న 57వ సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో శిరీష పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఆలూర్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు జి.సాయన్న, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వీడీసీ సభ్యులు అభినందించారు.

గీత హైస్కూల్ విద్యార్థిని..


నిహారిక

నందిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలోని శ్రీ గీత కాన్వెంట్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మందజి నిహారిక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. వరంగల్ జిల్లాలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి 57వ సీనియర్ ఖోఖో పోటీల్లో నిహారిక పాల్గొనున్నారు. ఈ సందర్భంగా నిహారికను పాఠశాల కరస్పాండెంట్ కనూరి గంగసాగర్, డైరెక్టర్ కానూరి శోభ, పాఠశాల హెచ్‌ఎం చెలిమెల గంగాభూషణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ముత్యం, పాఠశాల సిబ్బంది నిహారికను అభినందించారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

వివేకానంద చూపిన మార్గంలో నడవాలి

డిచ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద చూపిన మార్గంలో విద్యార్థులు నడవాలని ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఇందూరు విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దేశం, కోసం, ధర్మం కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా, సభ్యులు అమృత్ చారి, వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు నాగరాజు,సమీర్, అక్షయ్, లెనిన్, అజయ్ సతీష్ మోహన్ పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నరేశ్


రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ సీఈ మధుసూదన్

పచ్చలనడ్కుడ పెద్దచెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ, ఎస్ఈ

వేల్పూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామ పెద్ద చెరువు ఇరిగేషన్ సీఈ మధు సూదన్‌రావు, ఎస్ఈ యాశస్విలు బుధవారం పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, చెరువు కట్ట అలుగులు, చెరువు పంటలకు నీరందించే కాలువలను అధికారులు పరిశీలించారు. పరిశీలనకు వచ్చిన అధికారులతో ఈ సందర్భంగా చెరువు నుంచి పంటలకు సాగునీరు అందించే ఇరిగేషన్ కాలువను మరమ్మతులు చేయించాలని నీటిని వృధా కాకుండా కాలువకు ఇరువైపులా గోడను నిర్మించాలని స్థానిక రైతులు సీఈ ని స్థానిక రైతులు కోరారు. రైతుల కోరిక మేరకు ఇరిగేషన్ కాలువను సర్వే చేసి ప్రపోజల్ పంపాలని సీఈ మధుసూదన్, డీఈ, ఏఈలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ భానుప్రకాష్, డీఈ సురేష్, ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలను చెల్లించాలి


నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని బుధవారం హైదరాబాద్‌లో వాణిజ్య పన్నుల శాఖ మంత్రి, నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌కు బోధన్, మెదక్, మెట్‌పల్లి యూనిట్ కార్మిక సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ లేఆఫ్ నాటి నుంచి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిజాంషుగర్స్ యూనిట్లను ప్రభుత్వ అధీనంలో తిరిగి పునర్ ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్మికులకు, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేఆఫ్ నాటి నుంచి కార్మికులకు వేతనాలు రాకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి బకాయి వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో మెదక్, మెట్‌పల్లి, బోధన్ కార్మిక సంఘాల నాయకులు తదితరులున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రస్థాయి అధికారుల బృందం



బీర్కూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం రాష్ట్రస్థాయి అధికారుల బృందం దర్శించుకున్నారు. శ్రీవారికి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అధికారులకు శాలువాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏజీ ఆడిట్ అధికారి శేఖర్, అసిస్టెంట్ ఆడిట్ అధికారి దేవేందర్, మిషన్ భగీరథ డీఈ మున్నీ, ఏఈ రాజశేఖర్ రెడ్డి, తదితరులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్స రాజు, ప్రధాన అర్చకులు నందు పంతులు, ఆలయ మేనేజర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కలరింగ్ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం


కలరింగ్ పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు

మోర్తాడ్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ముంబాయికి చెందిన రంగోత్సవ సెలబ్రేషన్ ఆధ్వర్యంలో కలరింగ్ కాంపిటిషన్ నిర్వహించారు. ఈ పోటీ ల్లో విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ బహూ మతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు రవి, సాగర్, నర్సింహ మూర్తి, రమణచారి, రాజ్‌కుమార్, మనోజ్, రాము, సీఆర్‌పీ లు సురేష్, శ్రీరాం, శిరీష, తదితరులు ఉన్నారు.

సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు కలిగోట పూర్వవిద్యార్థి

● తెలంగాణ జట్టు కెప్టెన్‌గా భవాని ఎంపిక


భవాని

జక్రాన్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థిని భవాని ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి బుధవారం తెలిపారు. చెన్నైలోని జేపీఆర్ యూనివర్సిటీలో ఈ నెల 7నుంచి 11వ తేదీ వరకు జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రస్తుత పూర్వ విద్యార్థి భవాని నిజామాబాద్‌లోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుందని తెలిపారు. ఈ టోర్నమెం ట్‌కు ఎంపికైన భవానిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వీడీసీ సభ్యులు అభినందించారు.


కలెక్టర్‌తో సమావేశమైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నాగారంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల మరమ్మతులకు విడుదలైన రూ.కోటి 25లక్షలతో పనులను వెంటనే ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని, నగర ప్రజా ఆరోగ్యం అవసరాలకు అనుగుణంగా నిర్మించిన షైమదీబజార్, ఖలీల్‌వాడిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లను త్వరలో ప్రారంభించి ఉపయోగంలోకి తేవాలని కోరారు. టీయూఎఫ్ఐడీసీ ఫండ్ కింద నియోజకవర్గానికి మంజూరైన 60కోట్ల రూపాయల పనులకు టెండరింగ్ పిలిచి త్వరితగతిన పనులు ప్రారంభించాలని కోరారు. నగరంలో కబ్జాలు పెరిగిపోయి సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారని ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫుట్‌పాత్ కబ్జాలు, రోడ్లపై విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీ కోసం కేంద్ర నాయకత్వంతో ఎంపీ అర్వింద్‌తో కలిసి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్, డీఈ ప్రవీణ్, మున్సిపల్ ఈఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల ప్రారంభానికి కృషి

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని షైమదీబజార్, ఖలీల్‌వాడిలోగల ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ మురళి, ఆర్‌అండ్‌బి అధికారులు సాయికుమార్, మున్సిపల్ రిటైర్డ్ ఈఈ రషీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారుల నిరసన

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా ఫుట్‌పాత్‌లపై కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని కొన్ని రోజులుగా అధికారులు, పోలీసులు కూరగాయలు అమ్మనివ్వడం లేదంటూ కూరగాయల వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు రోడ్డుపై కూరగాయలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. వాహనాలు వెళ్లకుండా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా ఫుట్‌పాత్‌పైనే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్నామని గత కొన్నిరోజులుగా ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకోకుండా అధికారులు వేధిస్తున్నారని అన్నారు. డీఎస్ మార్కెట్‌లోకి వెళితే వ్యాపారం సాగదని ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారం చేసుకుంటామని తెలిపారు. చాలా సేపు నిరసన వ్యక్తం చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది నెలకొంది. పోలీసులు వారిని సముదాయించి పంపించారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రాత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో-1 కార్యాలయం ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్న హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఎం సరస్వతి, డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, డాక్టర్ రాజేష్, పీవో పద్మజ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో క్యూఆర్ కోడ్ అమలు

ఖిల్లా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుదారుల ఫీడ్‌బ్యాక్ సేకరించడం జరుగుతుందని ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి9న రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈక్యూఆర్ కోడ్ వల్ల పోలీసుల గురించి ప్రజల నుంచి వారి అభిప్రాయాల సేకరణ కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్‌నగర్‌లో రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏబీవీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, టీజీవీపీ, టీవీయూవీ, జీవీఎస్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాలు బుధవారం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీఎస్‌యూ అధ్యక్షుడు అనిల్, నాయకులు మేత్రి రాజశేఖర్, బొబ్బిలి కళ్యాణ్, లాల్‌సింగ్, జైత్రాం రాథోడ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

మెస్‌చార్జీల అమలులో ప్రభుత్వం విఫలం

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెంచిన మెస్ చార్జీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ విమర్శించారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షురాలు అంజలి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించగా ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

'ప్రజాపాలన' తెచ్చిన ఘనత ఉద్యోగులదే..

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, తదితరులు

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలన తెచ్చిన ఘనత ఉద్యోగులకే దక్కుతుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌తో కలిసి నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ ప్రభుత్వంలో కుటుంబసభ్యులేనని అన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యోగులను ఏ విధంగా ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసునన్నారు. ఒక్క సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ప్రభుత్వానిది అన్నారు. గతంలో తెలంగాణలో గడీల పాలన నడిచేదని, ప్రస్తుతం ప్రజాపాలనతో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1వ తేదీన జీతాలు ఇస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సబ్ కమిటీ వేసిందని త్వరలో పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 317జీవోను తీసుకువచ్చి ఉద్యోగులను ఇష్టం వచ్చినట్లు విభజించారని అన్నారు. ప్రభుత్వం పడిపోవడానికి కారణం 317 జీవో అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ డీఏలను ఆపినందుకే ఈ ప్రభుత్వాన్ని తీసుకొచ్చామన్నారు. మార్చి వరకు వెసులుబాటు ఇవ్వండని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని ప్రభుత్వానికి సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల కోసం కల్యాణ మండపాన్ని నిర్మించడానికి కృషి చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యేను కోరారు. పది సంవత్సరాల్లో టీఎన్‌జీవోస్‌కు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని షబ్బీర్ అలీ తన నిధుల నుంచి 25లక్షల రూపాయలను ఇచ్చాడని తెలిపారు. కల్యాణ మండపం, హౌజ్‌సైట్‌లేని జిల్లా నిజామాబాద్ మాత్రమేనని అన్నారు. కల్యాణ మండపాన్ని హౌజ్‌సైట్‌లను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, నుడా చైర్మన్ కేశవేణు, జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థిని విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను వివిధ గురుకులాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనుందని ఆయన తెలిపారు. గురుకులాలలో ప్రవేశం కోసం విద్యార్థులు టీజీసెట్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 1లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశం కోసం, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశం కోసం, ఖమ్మంలో గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్‌వోఈలో 8వ తరగతిలో ప్రవేశం, అలుగనూరులోని సీవోఈలో 9వ తరగతిలో, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

10న ఎమ్మెల్యేల ఇంటి ఎదుట ధర్నా

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని జనవరి 10న ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నూర్జహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ సమావేశాల సందర్భంగా ఆశాకార్యకర్తల సమస్యలపై చర్చించాలని కోరుతూ ఈనెల 10న ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నాలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశావర్కర్లకు 18వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 15 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేశారని అన్నారు. అప్పటి డైరెక్టర్ శ్రీనివాస్‌రావు నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుకన్య, రేవతి, అనిత, లలిత, గీత, గౌరీ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు రమేష్ బిదౌరీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్ గడుగు రోహిత్, వేణురాజ్, హర్షద్, మోయిన్, తదితరులు పాల్గొన్నారు. మొదట భరతమాత చిత్రపటాన్ని పట్టుకొని బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకుడు రమేష్ బిదౌరీ సంస్కారం లేని నీచుడని ఎంపీ ప్రియాంక గాంధీపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు బీజేపీ నాయకులకు స్త్రీల పట్ల ఉన్న కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఈ వ్యాఖ్యలతో బీజేపీ నేతల సంస్కారం బయటపడిందని బీజేపీ అంటేనే హత్యలు, మానభంగాలు, దోపిడి వంటివి గుర్తుకు వస్తాయని అలాంటి వారు ధర్మం గురించి, మహిళల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రమేష్ బిదౌరీ వ్యాఖ్యలకు నిరసనగా హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తే బీజేపీ నేతలు సిగ్గులేకుండా దాడులు చేశారని నిజామాబాద్ కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారని వారు అన్నారు. రమేష్ బిదౌరీని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, పవన్, అక్రమ్, సాయికిరణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భవన్ ముట్టడికి బీజేవైఎం యత్నం

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ నేతల దాడికి నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు కాంగ్రెస్ కార్యాలయం వద్ద బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మొదట బీజేవైఎం నాయకులు నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆ తర్వాత అక్కడి నుంచి ర్యాలీగా కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేవైఎం నాయకుల మధ్య తోపులాట జరిగింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నాయకులు నరేష్, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయకుండా శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న తమను అరెస్టు చేయడం సరికాదన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. బీజేవైఎం నేతలు కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారనే విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

నిరాశ్రయులైన వయోవృద్ధులను ప్రభుత్వ వృద్ధాశ్రమంలో చేర్పించాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అరవై సంవత్సరాల పైబడిన వయోవృద్ధులకు వసతి కల్పించుటకు డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వృద్ధాశ్రమం నిర్మించబడిందని కావున ఈ వృద్ధాశ్రమంలో కేవలం నిరాశ్రయులైన వయోవృద్ధులకు ఈనెల 10వ తేదీ నుంచి వసతి కల్పించడం జరుగుతుందని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వయోవృద్ధుల పోషణ, చట్టం, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ సిటీజన్ అసోసియేషన్స్, ఫోరమ్స్, ట్రస్టులు, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు, తమ తమ పరిధిలో ఎవరైనా నిరాశ్రయులైన వృద్ధులు ఉంటే ప్రభుత్వ వృద్ధాశ్రమంలో చేర్పించాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్ 9849933300, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ 9618844461 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా అపూర్వ స్కూల్ వార్షికోత్సవం

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజోతి): నగరంలో ఖలీల్‌వాడిలో గల అపూర్వ స్కూల్ 25వ వార్షికోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కుసుమలతరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్మితరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న పాఠశాల విద్యార్థులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అవీన్ సనార్

మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్

సుభాష్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్‌ను నిర్వహించినట్లు గుండె ఆపరేషన్ నిపుణులు అవీన్ సనార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 16 సంవత్సరాల క్రితం జరిగిన ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ అయిన భీంగల్ మండలం బెజ్జోర గ్రామానికి చెందిన గంగారాం ఈనెల 6వ తేదీన చాతి నొప్పి, దమ్ముతో ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. 16 ఏళ్ల క్రితం ఆపరేషన్ తర్వాత మళ్లీ ఇబ్బంది వచ్చిందని నిర్ధారించి కుటుంబ సభ్యుల అంగీకారంతో మళ్లీ ఆపరేషన్ చేశామన్నారు. ఇలాంటి హైరిస్‌తో కూడిన ఆపరేషన్ జిల్లాలో మొదటిసారిగా మెడికవర్ ఆసుపత్రిలో చేశామని అనెస్తిషియా డాక్టర్ వను తెలిపారు. నెలకు ఆసుపత్రిలో 20 నుంచి 30 ఓపెన్ హార్ట్ ఆపరేషన్లు చేస్తున్నామని సెంటర్ హెడ్ స్వామి అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు రవికిరణ్, యజ్ఞ, మార్కెటింగ్ హెడ్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో బీజేపీ ఎస్సీ మోర్చా నిరసన

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా బుధవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో పూలాంగ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుతూ పోలీస్ వ్యవస్థను వారికి అనుకూలంగా మార్చుకుంటుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, ఇప్పకాయల సుదర్శన్, ముత్యాలు, బాలకృష్ణ, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులకు పెరిగిన పోటీ

(ఐదో పేజీ తరువాయి)

ఈ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి పదవులు అనుభవించి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన వారు మరోదఫా ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారికే ఈ దఫా పోటీకి అవకాశం ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఎమ్మెల్యేల నుంచి పీసీసీ అధ్యక్షుని వరకు విన్నవిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే ప్రధానంగా దృష్టిపెట్టనుండటంతో సర్వేల ద్వారా సీట్లను కేటాయిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ డిచ్‌పల్లి లో జరిగిన సమావేశంలో ప్రకటించారు. పార్టీని అట్టుపెట్టుకొని పదేళ్ల పాటు కష్టపడ్డ వారికి తగిన అవకాశాలు ఇస్తామని ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యేలు ఉన్నచోట గొడవలు తక్కువ గానే ఉన్నా.. వారు లేనిచోట ఎక్కువగా అంతర్గతపోరు కొనసాగుతోంది. నియోజకవర్గ ఇన్ చార్జీలతో పాటు ఇతర నేతల ద్వారా పార్టీకి చెందిన వారు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో అన్ని పథకాలను పరిశీలించడంతో పాటు లబ్ధిదారులకు అందే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో తమ వర్గాలను తయారు చేసుకుంటూ వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. పోటీకి ఎక్కువ మంది సిద్ధం కావడం ఇప్పటి నుంచే క్యాడర్ ఒత్తిళ్లు పెంచడంతో ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నేతలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మాకు కూడా పదవులు వచ్చే విధంగా అవకాశాలు ఇవ్వాలని వారు కోరుతూ ఎన్నికల కోసం సన్నద్ధమవుతున్నారు. ఎంత ఖర్చు అయినా పెట్టుకోవడం తో పాటు మండల, జడ్పీ స్థానాలను పొందేందుకు సిద్ధమవుతున్నారు. పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉండటం ప్రస్తుతం పదవుల కోసం ఎక్కువ మంది పోటీ పడుతుండటంతో నేతలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థల్లో ఎక్కువ మందికి అవకాశాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలించకుంటే నామినేటెడ్ పోస్టులతో పాటు జిల్లా పార్టీలో తగిన అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పోటీ పెరుగుతుండటం వల్ల నేతలు కూడా విస్తుపోతున్నారు. సంవత్సరం కాలంగా క్యాడర్ కూడా తగిన పనులు కల్పించకపోవడం వల్ల ఎక్కువ మంది ఎదురు చూస్తున్నారని పార్టీకి చెందిన సీనియర్ నేతలు తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

అటవీ ప్రాంతాల్లోని రైతులకు సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవనాలపై సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రధాన మంత్రి పీఎం కుసుం పథకంలో భాగంగా రైతులు రెండు మెగా వాట్ల వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉన్నందున ఈ దిశగా రైతులను చైతన్యవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ రెడ్‌కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 4 నుంచి 5 ఎకరాల భూమి అవసరం అవుతుందని దీని కోసం స్థల సేకరణ చేయాలన్నారు. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుందని భూమిలభ్యత ఎక్కువగా ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నురాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులకు, ఉద్యోగులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న సైబర్ మోసాల గురించి ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సైబర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ప్రజల అమాయకత్వం, అజాగ్రత్తను ఆసరగా చేసుకొని సైబర్ నేరగాళ్లు ఆర్థికపరమైన మోసాలకు పాల్పడుతుంటారని ఆయన వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్ల ఆచూకి తెలుసుకొని వారిని కట్టడి చేసేందుకు పోలీసు శాఖ సైబర్ విభాగం ద్వారా కృషి చేస్తుందని అన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ విభాగాన్ని సంప్రదిస్తే మోసగాళ్లను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నేరాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.245	రూ. 265

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79800	రూ.73600	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.20, 2.45)
: మార్కో (7.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 1.50, 4.40, 7.30)
: పుష్ప-2 (10.20)
స్క్రీన్-3 : మార్కో (11.05)
: పుష్ప-2 (హిందీ) (2.10)
: పుష్ప-2 (తెలుగు) (6.15)
: బేబిజాన్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : కార్వన్ ది హంటర్ (ఇంగ్లీష్) (11.00, 5.00)
: మార్కో (1.55, 10.50)
: కార్వన్ ది హంటర్ (తెలుగు) (7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాక్స్ (10.25, 1.20, 4.25, 10.30)
: పుష్ప-2 (7.00)
స్క్రీన్-2 : ముఫాసా (11.00, 1.20, 10.20)
: పుష్ప-2 (4.10)
స్క్రీన్-3 : పుష్ప-2 (1.10, 10.00)
: ముఫాసా (తెలుగు 3డి) (5.00, 7.30)

దేవి: మార్కో (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : మ్యాక్స్ (2.00, 9.00)
: కార్వన్ ది హంటర్ (11.00, 6.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్: యుఐ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్